
సాక్షి ఒడిశా

మంగళవారం । 6 । ఫిబ్రవరి । 2024



శ్రీ మందిరం ఆదాయం లెక్కింపు

నగదు	రూ.6.21.057
బంగారం	800 మిల్లీ గ్రాములు
వెండి	3 గ్రాముల 300 మిల్లీ గ్రాములు

– భువనేశ్వర్/పూరీ



సభా సమయం

సార్వత్రిక ఎన్నికలు పురస్కరించుకొని 2024-25 మధ్యంతర బడ్జెట్ ప్రవేశపెట్టేందుకు శాసనసభ సమావేశాలు సోమవారం నుంచి ప్రారంభమయ్యాయి.

- 8లో



మార్చి 11 నుంచి శతావధానం

రాయగడ పట్టణంలో తొలిసారిగా మార్చి 11వ తేదీ నుంచి శతావధానం నిర్వహించనున్నట్లు ఉత్కళాంధ్ర బ్రాహ్మణ సేవా సమాజం అధ్యక్షుడు రేజేటి శ్రీనివాస్ శర్మ తెలిపారు.

- 8లో

న్యూస్‌రీల్

సైన్స్ నిఘంటువు ఆవిష్కరణ



నిఘంటువు ఆవిష్కరిస్తున్న పాండియన్

భువనేశ్వర్: ప్రపంచ ప్రథమ ఒడియా భాషా సదస్సు సందర్భంగా సైన్స్ అండ్ టెక్నాలజీ విభాగం రూపొందించిన సైన్స్ ఒడియా నిఘంటువును నవీన్ ఒడిశా అధ్యక్షుడు వి.కె.పాండ్యన్ సోమవారం ఆవిష్కరించారు. సైన్స్‌పై ఆసక్తి ఉన్న పిల్లలకు ఈ పదజాలం చాలా ఉపయోగకరంగా ఉంటుందన్నారు. అనంతరం సైన్స్ అండ్ టెక్నాలజీ విభాగం, ఉన్నత విద్యా శాఖ సంయుక్తంగా నిర్వహించిన వ్యాసరచన, వక్తృత్వం, జగన్నాథ్ సంస్కృతి, విజ్ఞాన విభాగాల్లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు.

గంజాయి పంట ధ్వంసం



గంజాయి పంటను ధ్వంసం చేస్తున్న పోలీసులు

కొరాపుట్: జిల్లాలో గంజాయి పంట సాగుపై పోలీసులు ఉక్కుపాదం మోపారు. ధనాబెడా, గెలగుడ, చుటిపొడ గ్రామాల్లో గంజాయి సాగు చేస్తున్నట్లు సమాచారం మేరకు పోలీసులు దాడులు నిర్వహించారు. మెజిస్ట్రేట్ సమక్షంలో రెవెన్యూ సిబ్బందితో కలసి పంటను ధ్వంసం చేశారు.

భారీగా గంజాయి స్వాధీనం



గంజాయితో పట్టుబడిన నిందితులను చూపిస్తున్న పోలీసులు

రాయగడ: జిల్లాలోని గుడారిలో పోలీసులు భారీగా గంజాయి స్వాధీనం చేసుకున్నారు. గుడారి నుంచి గంజాం జిల్లాకు అక్రమంగా గంజాయి రవాణా అవుతున్న సమాచారాన్ని తెలుసుకున్న పోలీసులు ఈ మేరకు గుడారిలో సోమవారం దాడులు నిర్వహించారు. దీనిలో భాగంగా ఒక బొలేరోను ఆపి తనిఖీ చేయగా 12 ప్లాస్టిక్ సంచుల్లో సుమారు 417.460 కిలోల గంజాయి పట్టుబడింది. ఈ దీంతో ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. అరెస్టైనవారిలో గంజాం జిల్లా సొరడ ప్రాంతానికి చెందిన సంజయ్ రైతా(25), అడవ ప్రాంతానికి చెందిన అజిత్ రైతా(22)లు ఉన్నారు. వీరి నుంచి గంజాయితో పాటు రెండు సెల్‌ఫోన్లు, రూ.200 నగదును స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి నిందితులను కోర్టుకు తరలించారు.

నదిలో మునిగి మహిళ మృతి



కోశీ మడ్కామి మృతదేహం

మల్కన్‌గిరి: జిల్లాలోని పోడియా సమితి సిమిలిబంచి పంచాయతీ కుర్తి గ్రామం వద్దనున్న శబరీ నదిలో సోమవారం ఉదయం మహిళ మృతి చెందింది. వివరాల్లోకి వెళ్తే.. గ్రామానికి చెందిన కోశీ మడ్కామి (38) ఎప్పటిలాగే తోటి మహిళలతో కలిసి నది ఒడ్డుకు స్నానానికి వెళ్లింది. అయితే దురదృష్టావశాత్తు ఆమె నదిలో పడిపోయారు. దీంతో అక్కడ ఉన్నటువంటి మహిళలు కేకలు వేయగా, సమీపంలో ఉన్నటువంటి కొంతమంది పురుషులు వచ్చి ఆమెను బయటకు తీశారు. అయితే అప్పటికే ఆమె మృతి చెందింది. దీంతో పోలీసులకు సమాచారం ఇవ్వడంతో వారు నది వద్దకు వచ్చి మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్నారు. కలిమెల ఆరోగ్య కేంద్రానికి పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. కేసు నమోదు చేసి, అనంతరం బంధువులకు మృతదేహం అప్పగించారు.







నెమళ్ల కనువిందు..!

గంజాం జిల్లా అస్కా అటవీ రేంజ్ పరిధి పకిడి హిల్స్‌పై నెమళ్లు సందడి చేస్తూ సందర్శకులను కనువిందు చేస్తున్నాయి. పురివిప్పి నాట్యమాడుతూ పర్యాటకులను ఆకట్టుకుంటున్నాయి. అయితే చుట్టూ పంట పొలాల్లో క్రిమి సంహారక మందులను అధికంగా ఉపయోగిస్తుండడంతో నెమళ్లకు ఇబ్బందులు తలెత్తుతున్నాయని పర్యావరణ ప్రేమికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

– బరంపురం

ప్రసంగంతో...

పొలిటికల్ టర్న్..!



ప్రసంగిస్తున్న వీకే పాండియన్

- కొనసాగుతున్న ఒడియా భాషా సదస్సు
- ప్రసంగించిన వి.కె.పాండియన్
- తదుపరి ప్రభుత్వం తమదేనని పరోక్షంగా వెల్లడి

భువనేశ్వర్: అత్యంత అట్టహాసంగా రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన ప్రపంచ ప్రథమ ఒడియా భాషా సదస్సు అనుకోకుండా సరికొత్త మలుపు తిరిగింది. భాషా భావోద్వేగంతో కొనసాగిన ఈ సదస్సును వి.కె.పాండియన్ ప్రసంగం రాజకీయ సెగతో వేడెక్కించింది. రాబోయే అసెంబ్లీ ఎన్నికల తర్వాత ఒడిశాలో బిజూ జనతాదళ్ (బీజేడీ) అధికారంలోకి వచ్చి పాలనా పగ్గాలు చేపడుతుందనే అంచనాతో పలు ఆసక్తికరమైన అంశాలను ఆయన వెల్లడించారు. ఇటీవల ఆయన బ్యూరోక్రాట్ సేవలకు స్వస్తి పలికి ప్రత్యక్ష రాజకీయాల్లోకి అడుగు పెట్టిన విషయం తెలిసిందే. ఈ తరుణంలో భాషా సదస్సు వేదికపై ఆయన ప్రసంగం మరింత చర్చనీయాంశమైంది. రాబోయే 5 ఏళ్లలో రాష్ట్ర ప్రభుత్వ పాలన రోడ్‌మ్యాప్‌ను సోమవారం జరిగిన ఒడియా భాషా సదస్సులో వివరించారు.

5టీ చైర్మన్ హోదాలో హాజరు

నగరంలో జరుగుతున్న ప్రపంచ ప్రథమ ఒడియా భాషా సదస్సు సభకు ఆయన 5టీ, నవీన్ ఒడిశా చైర్మన్ హోదాలో హాజరయ్యారు. ఈ సందర్భంగా 2024 నుంచి 2029 సంవత్సరాల మధ్య ప్రభుత్వ పాలన రాష్ట్రానికి గేమ్ ఛేంజర్‌గా నిలుస్తుందని ప్రకటించారు. గత 5 ఏళ్ల పాలన (2019-24)తో పోలిస్తే 2024 నుంచి 2029 వరకు వచ్చే 5 ఏళ్ల రాష్ట్ర ప్రజలకు మరింత వేగంగా, విస్తారంగా కలిసికట్టు పాలనతో పచ్చదనంతో కూడుకునే సాధికారత అందించడం జరుగుతుందన్నారు. 2019 నుంచి రాష్ట్రం ప్రతీ రంగంలో అద్భుతమైన అభివృద్ధి సాధిస్తోందని వెల్లడించారు. వచ్చే 5 ఏళ్లలో అభివృద్ధి బాటలో ఒడిశా ఇతర రాష్ట్రాలతో కాకుండా, ప్రపంచంతో పోటీ పడుతుందని నొక్కి వక్కాణించారు. మన లక్ష్యం చాలా సువిశాలమని పేర్కొన్నారు. వచ్చే ఐదేళ్లలో ఒడిశా ఎదుగుదల, అభివృద్ధి, సాధికారిత ప్రత్యక్షంగా కనిపిస్తుందని తెలిపారు. రాష్ట్రం విద్య, ఆరోగ్య సంరక్షణ రంగాలతో సహా అన్ని రంగాల్లో రూపాంతరం చెందుతోందన్నారు. 2000 సంవత్సరంలో 68 శాతం ఉన్న పేదరికం స్థాయి, ప్రస్తుతం 11 శాతానికి తగ్గడం సాధికారితకు నిలువెత్తు తార్కాణంగా పేర్కొన్నారు. గతంలో ఆహార పంటల కోసం పంజాబ్, హర్యానాలపై ఆధారపడ్డ ఒడిశా, నేడు ఈ రంగాల్లో మిగులు రాష్ట్రంగా నిలిచి చాలా రాష్ట్రాలకు ఆహారం అందజేసే స్థాయికి ఎదిగిందని సగర్వంగా ప్రకటించారు.

ఆధ్యాత్మిక దృక్పథంతో పాలన

ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ నాయకత్వంలో రాష్ట్రంలో ఆధ్యాత్మిక దృక్పథ పాలన కొనసాగుతోందన్నారు. రాష్ట్రంలో పూర్తిగా ఆధ్యాత్మిక విలువలతో మార్గనిర్దేశం చేయబడుతోందన్నారు. మహాప్రభువు శ్రీజగన్నాథుని ఆశీస్సులతో రాష్ట్ర పరివర్తన శరవేగంగా సాగుతోందని పేర్కొన్నారు. మరో వైపు భాషా రంగంలో దేశ, విదేశాల నుంచి విచ్చేసిన భాషావేత్తలు, పరిశోధకులు, సాహితీవేత్తలు ఇతరేతర అనుబంధ వర్గాల అభిప్రాయాలు, మార్గదర్శకాలను ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ ప్రామాణికంగా పరిగణించి, సరికొత్త భాషా విధానాన్ని ప్రవేశ పెట్టనున్నట్లు తెలిపారు.

మరో మూడు రోజులు పొడిగింపు

జనతా మైదానంలో నిర్వహిస్తున్న ఒడియా భాషా సదస్సు మరో 3 రోజుల పాటు పొడిగించారు. 5 ఏళ్లకోసారి ఈ సదస్సు జరుగుతుందని ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ సోమవారం ప్రకటించారు. వాస్తవానికి సదస్సు సోమవారంతో ముగియాల్సింది. అయితే సదస్సుపై ఆదరణ, భాషాప్రియుల ఉత్సాహం పరిగణనలోకి తీసుకుని, మరో 3 రోజుల పాటు పొడిగించినట్లు వెల్లడించారు. దీంతో ఈనెల 8వ తేదీ వరకు నిరవధికంగా కొనసాగనుంది.

భాషాభివృద్ధిలో మహిళల పాత్ర గొప్పది

ఒడియా భాషాభివృద్ధిలో మహిళల పాత్ర గొప్పదని పలువురు అభిప్రాయం వ్యక్తం చేశారు. ప్రపంచ ప్రథమ ఒడియా భాషా సదస్సులో భాగంగా ఒడియా భాష, మహిళా సాధికారతపై ప్రత్యేక సభ సోమవారం నిర్వహించారు. ఒడియా భాష కాలానుక్రమంగా పలు రకాలుగా వన్నెలు దిద్దుకోవడంలో మహిళల పాత్ర అనన్యమని పేర్కొన్నారు. ప్రధానంగా ఒడిస్సీ నృత్యం, ఒడియా భాష, సాహిత్యం సుసంపన్నం చేయడంలో మహిళల ప్రత్యేక సహకారాన్ని మరువలేనిదన్నారు. మహిళలు ఆచరించే వ్రతాలు, నోములకు సంబంధించిన సాహిత్యం, పలు దశల్లో ఒడియా భాషా పరిణామం వంటి అంశాల్లో మహిళ పాత్రపై లోతుగా చర్చ సాగింది. సభకు డాక్టర్ ప్రతిభా రే అధ్యక్షత వహించారు. పద్మశ్రీ ప్రియంవద మహంతి హెజ్మది, డాక్టర్ అసమృత మిశ్రా, సుస్మితా బాగ్చీ, డాక్టర్ యశోధర మిశ్రా, పరమిత శత్పతి వక్తలుగా పాల్గొని తమ అభిప్రాయాలను విశ్లేషించారు.

తారల సందడి

కొరాపుట్: తెలుగు సినీ ప్రముఖ తారలు అనుష్క, రమ్యకృష్ణలు కొరాపుట్ జిల్లాలో పర్యటిస్తున్నారు. ఒక చలన చిత్రం షూటింగ్ కోసం వారు వచ్చారు. వీరి రాకపోకలు పూర్తి రహస్యంగా ఉంచుతున్నారు. విశ్వసనీయవర్గాల సమాచారం ప్రకారం ఫస్ట్ ఫ్రేం ప్రొడక్షన్ సంస్థ క్రిష్ దర్శకత్వంలో నిర్మిస్తున్న సినిమా చిత్రీకరణ ఇక్కడ జరుగుతోంది. ఫిబ్రవరి 14వ తేదీ వరకు దేవమాలితో పాటు కొలాబ్, జయపూర్ రాజకోట, లమ్తాపుట్ అడవులు, సమీప ఛత్తీస్‌ఘడ్ రాష్ట్రంలోని చిత్రకూట్ జలపాతం వద్ద షూటింగ్ జరగనుంది. షూటింగ్ ప్రాంతంలోనికి ఎవరినీ అనుమతించడం లేదు.

గుర్తు తెలియని జంతువులు దాడి



మేకలు మృతి చెందిన ప్రాంతాన్ని పరిశీలిస్తున్న అటవీశాఖ అధికారులు



గాయాలతో ఉన్న మేకను చూపిస్తున్న కద్రక

- 15 మేకలు మృతి

రాయగడ: జిల్లాలోని కల్యాణ సింగుపూర్ సమితి సునాఖండి పంచాయతీలోని నందిని గ్రామంలో ఆదివారం రాత్రి గుర్తు తెలియని జంతువు దాడిలో 15 మేకలు మృతి చెందగా, మరో ఐదు గాయపడ్డాయి. గ్రామానికి చెందిన గంగాధర్ కద్రక ఎప్పటిలాగే తన మేకలను ఒకచోట ఉంచి ఇంట్లో పడుకున్నాడు. కాగా ఉదయం లేచి చూసేసరికి 15 మేకలు మృత్యువాత పడగా, మరికొన్ని మేకలు గాయాలతో కొట్టుమిట్టాడుతుండడం గమనించాడు. తన ఇంటి వద్ద గల మేకల గుంపుపై ఏదో గుర్తు తెలియని జంతువు దాడి చేసిందని సమాచారాన్ని అటవీ శాఖ అధికారులకు అందజేశారు. రేంజర్ చందన్ గొమాంగో, ఫారెస్టర్లు ప్రదీప్ కుమార్ జెన్న, సత్య పట్నాయక్‌లు నందిని గ్రామానికి వెళ్లి పరిశీలించారు. మేకలు మృతి చెంది పడిఉన్న ప్రాంతాన్ని సందర్శించిన రేంజర్ ఏదో జంతువు దాడిలో ఈ మేకలు మృత్యువాతపడ్డాయని అనుమానించారు. అయితే భయభ్రాంతులకు గురికావద్దని గ్రామస్తులకు ధైర్యం చెప్పారు. జంతువు ఆచూకీ కనిపెట్టి పట్టుకునేందుకు చర్యలు తీసుకుంటామన్నారు.

పేకాటరాయుళ్లు అరెస్టు



పోలీసులకు చిక్కిన పేకాటరాయుళ్లు

రాయగడ: జిల్లాలోని చందిలి పోలీసుస్టేషన్ పరిధి మల్లిగాం పంచాయతీ కాశిలి గ్రామంలో పేకాట శిబిరంపై పోలీసులు శనివారం అర్ధరాత్రి దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో ఐదుగురు పేకాట రాయుళ్లను అరెస్టు చేసి, వారి నుంచి రూ.80,270 నగదుతో పాటు 27 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నట్లు చందిలి పోలీసుస్టేషన్ ఐఐసీ ప్రసన్న బెహర తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కొద్ది రోజులుగా జూదం శిబిరాలు నిర్వహిస్తున్నట్లు వచ్చిన సమాచారం మేరకు దాడులు నిర్వహించామన్నారు. పోలీసులను చూసి కొంతమంది పారిపోయారని, ఐదుగురు పట్టుబడ్డారని వెల్లడించారు. నిందితులను సోమవారం కోర్టుకు తరలించారు.



పోలీసులు స్వాధీనం చేసుకున్న నగదు

ప్రత్యేక సంచికలు ఆవిష్కరణ



సంచికలు ఆవిష్కరిస్తున్న మంత్రి ప్రదీప్ కుమార్ ఆమత్ తదితరులు

భువనేశ్వర్: ప్రపంచ ప్రథమ ఒడియా భాషా సదస్సు పురస్కరించుకుని ఉత్కళ ప్రసంగ్ (ఒడియా), ఒరిస్సా రివ్యూ (ఆంగ్లం) ప్రత్యేక సంచికలను రాష్ట్ర సమాచార, పౌర సంబంధాల శాఖ మంత్రి ప్రదీప్ కుమార్ ఆమత్ సోమవారం ఆవిష్కరించారు. సదస్సు ముగింపు వేడుకలో భాగంగా ఈ సంచికలను విడుదల చేయడం విశేషం. వీటిలో గత 80 ఏళ్లుగా ప్రచురితమైన అనేక ఆసక్తికర కథనాలు, వ్యాసాలు ఇతరేతర రచనలను పొందుపరచినట్లు మంత్రి తెలిపారు. ఈ పత్రికలు ఒడిశా సామాజిక, ఆర్థిక అభివృద్ధి, భాష, కళ, సంస్కృతికి సంబంధించిన సమాచారాన్ని వ్యాప్తి చేయడంలో కీలక పాత్ర పోషిస్తున్నాయని పేర్కొన్నారు. ఈ రెండు పత్రికలు 1944 నుంచి నిరంతరంగా ప్రచురితం అవుతున్నాయన్నారు. ప్రపంచ ఒడియా భాషా సదస్సును పురస్కరించుకుని ఈ పత్రికల్లో ఇదివరకు ప్రచురితమైన విలువైన కథనాలతో కూడిన ప్రత్యేక సంచిక వర్ధమాన తరాలకు అందుబాటులోకి తీసుకొచ్చినట్లు వెల్లడించారు. కార్యక్రమంలో రాష్ట్ర సమాచార, పౌరసంబంధాల శాఖ ప్రధాన కార్యదర్శి సంజయ్ కుమార్ సింగ్, ఒడిశా పర్యటన అభివృద్ధి సంస్థ (ఓటీడీసీ) చైర్మన్ డాక్టర్ లెనిన్ మహంతి, ఉత్కళ ప్రసంగ్, ఒరిస్సా రివ్యూ సంపాదకురాలు కస్తూరి మహాపాత్రో తదితరులు పాల్గొన్నారు.

పర్వతారోహణ పోటీలు



పర్వతారోహణలో పాల్గొన్న ఉత్సాహవంతులు

జయపురం: సమితిలోని భైరవ మఠం నుంచి ఖండమాలి పర్వతం వరకు పర్వతారోహణ పోటీలను డొంగిరియ ది మౌంటెన్ అసెండర్ సంస్థ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించారు. ఈ పోటీల్లో 6 ఏళ్ల నుంచి 72 ఏళ్ల వరకు వయస్సు కలిగిన మొత్తం 450 మంది పాల్గొన్నారు.

వీరిని 8 టీములుగా విభజించారు. పర్వతారోహణను సమాజ సేవకుడు హిమాంశు మహాపాత్ర జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా సంస్థ నిర్వాహకుడు రాజేష్ కుమార్ పాణిగ్రాహి మాట్లాడుతూ.. సుమారు 2 వేల అడుగులు ఉండే ఖండమాలి పర్వతాన్ని ఎక్కేందుకు 8 టీములు పోటీ పడ్డాయని వెల్లడించారు. వారికి గ్లూకోజ్, ఓఆర్ఎస్, పండ్లు, గుడ్లు తదితర సదుపాయాలు ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. ఆరోగ్యంపై అవగాహన కల్పించేందుకు పోటీలు నిర్వహించినట్లు తెలియజేశారు. కార్యక్రమంలో సుధామ్ మహరాణ, ఫహిమ్ అక్బర్ ఖాన్, నీలకేతన పాణిగ్రహి, శిశురంజన్ పండ, రఘునాథ్ సైప్, మహ్మద్ షాలిమ్, రామ నాయిక్, ఖగేశ్వర నారాజి, సన పాత్రో, శేఖ్ హబిబుల్లా తదితరులు పాల్గొన్నారు.

ఆటోను ఢీకొన్న వ్యాన్

- ఐదుగురికి గాయాలు



ప్రమాదంలో బోల్తాపడిన ఆటో





గాయలతో ఉన్న చిన్నారిని పట్టుకొని రోధిస్తున్న తల్లి , ఆటోలో చిక్కుకున్న ఉన్నవారిని రక్షిస్తున్న అగ్నిమాపక బృందం

బరంపురం: గంజాం జిల్లా రంబా జాతీయ రహదారి బైపాస్ జంక్షన్‌లో సోమవారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఐదుగురికి గాయాలయ్యాయి. ఐఐసీ అధికారి తపస్ కుమార్ నాయక్ తెలిపిన వివరాల మేరకు.. కళ్లికోట్ పోలీసుస్టేషన్ పరిధి రంబా జంక్షన్ వద్ద ఒక ఆటోలో తమ బంధువుల ఇంటికి వెళ్తున్నవారిని, ఆంధ్ర వైపు వెళ్తున్న వ్యాన్ బలంగా ఢీకొంది. ఈ ఘటనలో ఒక చిన్నారితో సహా ఐదుగురు గాయపడ్డారు. సమాచారం అందుకున్న కళ్లికోట్ పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది బృందం సంఘటన స్థలానికి చేరుకొని, తీవ్రగాయాలతో ఆటోలో ఉన్న ప్రయాణికులను రక్షించారు. అంబులెన్స్ సాయంతో కళ్లికోట్ బ్లాక్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

క్లుప్తంగా

మార్చి 11 నుంచి శతావధానం



వేదికపై నాగరాజు, శర్మ తదితరులు

రాయగడ: పట్టణంలో రాష్ట్రంలోనే తొలిసారిగా మార్చి 11వ తేదీ నుంచి 3 రోజుల పాటు శతావధానం నిర్వహించనున్నట్లు ఉత్కళ ఆంధ్ర బ్రాహ్మణ సేవా సమాజం అధ్యక్షుడు రేజేటి శ్రీనివాస్ శర్మ తెలిపారు. స్థానిక బాలాజీ నగర్‌లోని శ్రీకల్యాణ వేంకటేశ్వర మండపంలో సోమవారం జరిగిన సర్వసభ్య సమావేశంలో పాల్గొని మాట్లాడారు. ప్రముఖ శతావధాని బులుసు అపర్ణ విచ్చేసేందుకు అంగీకరించారని తెలిపారు. బంకుపల్లి రమేష్ సంచాలకులుగా వ్యవహరించనున్నారు. రెండు తెలుగు రాష్ట్రాలకు చెందిన అవధానులు, వందమంది ప్రశ్నకులు పాల్గొనున్నట్లు తెలిపారు. కార్యదర్శి భళ్లమూడి నాగరాజు మాట్లాడుతూ 27వ వార్షికోత్సవం 2024లో నిర్వహించబోయే కార్యక్రమాలను వివరించారు. సమావేశంలో ఉపాధ్యక్షుడు అవసరాల నారాయణమూర్తి, కోశాధికారి భాగవతుల సుబ్రహ్మణ్య శాస్త్రి తదితరులు పాల్గొన్నారు.

ఈనెల 8 నుంచి వసంతోత్సవాలు



రాయగడ: జిల్లాలోని గుణుపూర్‌లో ప్రతీ ఏడాది ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న వంశధార వసంతోత్సవాలకు సన్నాహాలు ప్రారంభమయ్యాయి. ఈనెల 8వ తేదీ నుంచి ఉత్సవాలను నిర్వహించేందుకు నిర్వాహకులు ఏర్పాట్లు చేస్తున్నారు. వారం రోజుల పాటుగా జరిగే ఈ ఉత్సవాలను అత్యంత ఘనంగా నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలియజేశారు. ఉత్సవాల్లో భాగంగా వివిధ సాంస్కృతిక కార్యక్రమాలను చేపట్టనున్నారు. అలాగే ఆదివాసీల సంస్కృతికి అద్దంపట్టే వివిధ నృత్య ప్రదర్శనలు కార్యక్రమంలో భాగంగా ఉంటాయి.

డ్రోన్లతో పిచికారీ మేలు

నరసన్నపేట: వరితో పాటు వాణిజ్య పంటలు, ఉద్యానవన పంటల్లో క్రిమిసంహారక మందుల పిచికారీకి డ్రోన్లను ఉపయోగించడం మేలని వ్యవసాయ సలహా మండలి జిల్లా అధ్యక్షుడు శిమ్మ నేతాజీ అన్నారు. మండలం కిళ్లాం, మాకివలసల్లో చెరుకు పంటపై పోషకాలను సోమవారం డ్రోన్లతో పిచికారీ చేసి చూపించారు. అలాగే క్రిమి సంహారక మందులు కూడా సులువుగా, వేగంగా పిచికారీ చేయవచ్చని అన్నారు.

'ఎండీఎం కార్మికుల సమస్యలు పరిష్కరించాలి'

శ్రీకాకుళం న్యూకాలనీ: మధ్యాహ్న భోజన పథకంలో పనిచేస్తున్న కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి పి.తేజేశ్వరరావు, జిల్లా ఉపాధ్యక్షురాలు అల్లు మహాలక్ష్మి, కె.నాగమణి, మధ్యాహ్న భోజన పథక యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి బి.ఉత్తర కోరారు. శ్రీకాకుళంలోని డీఈఓ కార్యాలయం వద్ద సోమవారం మధ్యాహ్న భోజన కార్మికులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్యాస్‌ను ప్రభుత్వమే సరఫరా చేయాలని, పథకం అమలుకు కనీస మౌలిక సదుపాయా లు కల్పించాలని విజ్ఞప్తి చేశారు. తమకు గుర్తింపు కార్డులు ఇవ్వాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. ధర్నాలో సీఐటీయూ ఉపాధ్యక్షులు కె.సూరయ్య, నాయకులు ప్రకాష్, ఎండీఎం జిల్లా నాయకులు వి.లక్ష్మి, మంగమ్మ, ఉమ, ఊర్మిల, కౌసల్య, దమయంతి, లక్ష్మి, అమ్మాజమ్మ తదితరులు పాల్గొన్నారు.

పారామిలటరీ కానిస్టేబుల్ మృతి

గార: ఇండియన్ టిబెట్ బోర్డర్ పోలీస్ (పారామిలటరీ) కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న రామచంద్రాపురం పంచాయతీ శిమ్మపేట గ్రామానికి చెందిన దుంగ రాంబాబు (37) మధ్యప్రదేశ్ రాష్ట్రంలోని కెరియా జిల్లాలోని శిక్షణ కేంద్రంలో మృతి చెందినట్టు కుటుంబ సభ్యులు తెలిపారు. సోమవారం ఉదయం 11 గంటల ప్రాంతంలో కేంద్రంలోని బ్యారక్‌లోనే మృతి చెందినట్టు అక్కడి నుంచి ఫోన్‌లో సమాచారం వచ్చిందని తెలిపారు. మృతికి గల కారణాలు తెలియాల్సి ఉంది. రాంబాబు అస్సాం ఐటీబీపీ రెజిమెంట్‌లోని కానిస్టేబుల్‌గా గత 17 ఏళ్లుగా పనిచేస్తున్నారు. రాంబాబుకు భార్య, ఒక కుమారుడు, కుమార్తె ఉన్నారు. రాంబాబు మృతి వార్తతో గ్రామంలో విషాద ఛాయలు అలముకున్నాయి.

చిన్నారులకు ఆర్థిక సాయం

ఇచ్ఛాపురం రూరల్: ఇచ్ఛాపురం మండలం తేలుకుంచి గ్రామానికి చెందిన చిన్నారులు శరణ్య, లిఖితలకు సాయం కొనసాగుతోంది. సాక్షి దినపత్రికలో 'అమ్మ లేదు..నాన్న రాడు' అనే శీర్షికన కథనం ప్రచురించడంతో దాతలు సాయం అందజేస్తున్నారు. తాజాగా ఒడిశా రాష్ట్రం కంబిరిగాం గ్రామానికి చెందిన 'కంబిరిగాం యూత్ వెల్ఫేర్ అసోసియేషన్' సభ్యులు సోమవారం చిన్నారులకు రూ.21,000 వేలు నగదుతో పాటు నిత్యావసర సరుకులు, నూతన దుస్తులను స్థానిక సర్పంచ్, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ పాతిర్ల రాజశేఖరరెడ్డి నేతృత్వంలో అందజేశారు.

సభా సమయం

- ప్రారంభమైన శాసన సభ సమావేశాలు
- తొలిరోజు గవర్నర్ ప్రసంగం
- అనంతరం నేటికి వాయిదా

భువనేశ్వర్:

సార్వత్రిక ఎన్నికలు పురస్కరించుకొని 2024-25 మధ్యంతర బడ్జెట్ ప్రవేశపెట్టేందుకు శాసనసభ సమావేశాలు సోమవారం నుంచి ప్రారంభమయ్యాయి. గవర్నర్ ప్రసంగం అనంతరం తొలిరోజు కార్యకలాపాలు వాయిదా పడ్డాయి. మంగళవారం నుంచి సభా కార్యక్రమాలు పూర్తిస్థాయిలో జరగనున్నాయి. ఈనెల 13వ తేదీతో మధ్యంతర బడ్జెటు సమావేశాలు ముగియనున్నాయి. ప్రభుత్వాన్ని నిలదీసేందుకు విపక్షాలు సిద్ధంగా ఉన్నట్లు ప్రకటించగా, వీరి దాడిని సమర్థంగా ఎదుర్కొంటామని అధికార పక్షం సభ్యులు తెలిపా రు. ఈనెల 8వ తేదీన సభలో మధ్యంతర బడ్జెటు ప్రతిపాదనలు ప్రవేశపెడతారు. ఈ విడతలో 7 పని దినాలతో బడ్జెటు సమావేశాలు జరగనున్నాయి.

దివంగతులకు శ్రద్ధాంజలి

సభా కార్యక్రమాలు ప్రారంభం కావడంతో దివంగత సభ్యులకు రాష్ట్ర గవర్నర్ రఘుబర దాస్ సభలో శ్రద్ధాంజలి ఘటించారు. వీరితో పాటు అమర జవానులకు నివాళులర్పించారు. అనంతరం గవర్నర్ ప్రసంగం ప్రారంభం అయింది. ఆయన ప్రసంగం సుదీర్ఘంగా 1 గంట 58 నిమిషాలు కొనసాగింది.



శాసనసభ ఆవరణలో గవర్నర్ రఘుబర్ దాస్‌కు గౌరవ కవాతుతో స్వాగతం



ప్రసంగిస్తున్న గవర్నర్ రఘుబర్ దాస్



సమావేశాలకు గవర్నర్‌ని సాదరంగా తీసుకెళ్తున్న స్పీకర్ ప్రమీలా మల్లిక్

ఉదయం 11 గంటలకు ప్రారంభమైన గవర్నర్ ప్రసంగం మధ్యాహ్నం 12.58 గంటల వరకు నిరవధికంగా కొనసాగింది. ఈ వ్యవధిలో 56 పేజీల ప్రసంగం చదివి వినిపించారు. ఈ ప్రసంగంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పలు పథకాలు, కార్యక్రమాలు, ప్రజాహిత కార్యకలాపాలను తెలియజేశారు. వీటిలో పూరీ శ్రీమందిరం వారసత్వ ప్రాకారం, ప్రథమ విశ్వ ఒడియా భాషా సదస్సు, మిల్లెటు మిషన్, కాలియా సహాయ పథకం, సుక్‌తేల్ ప్రాజెక్టు, 10 పట్టణ, నగర ప్రాంతాల్లో బీదల వాడల రూపాంతరం ప్రధానాంశాలుగా చోటు చేసుకున్నాయి.

కాంగ్రెస్ వాకౌట్

మధ్యంతర బడ్జెటు సమావేశాల్లో గవర్నర్ ప్రసంగంపై అభ్యంతరం వ్యక్తం చేస్తూ విపక్ష కాంగ్రెసు పార్టీ ఎమ్మెల్యేలు సభ నుంచి వాకౌట్ చేశారు. గవర్నర్ మాధ్యమంలో రాష్ట్ర ప్రభుత్వం స్వప్రయోజనాల ప్రచారం చేయిస్తోందని కాంగ్రెసు శాసన సభ నాయకుడు నరసింగ మిశ్రా ఆరోపించారు. ఈ చర్యపై నిరసనతో సభ నుంచి వైదొలగుతున్నట్లు ప్రకటించారు. రాష్ట్ర ప్రభుత్వం ముందస్తుగా సిద్ధం చేసిన అంశాలతో గవర్నర్ ప్రసంగించడంతో తప్పుడు సమాచారం సభలో ప్రవేశించిందని ఆయన ఆరోపించారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టాల్సిన భావి కార్యక్రమాలు, ఇతరేతర అభివృద్ధి మార్గదర్శకాలను సాధారణంగా గవర్నరు సభలో ప్రసంగిచడం ఆచారమని నరసింగ మిశ్రా హితవు పలికారు. అయితే సభలో సుదీర్ఘంగా కొనసాగిన గవర్నర్ ప్రసంగంలో ఇటువంటి శీర్షికలు మచ్చుకు కూడ లేకుండా పోవడం విచారకరమన్నారు.

వాయిదా

గవర్నర్ ప్రసంగం ముగియడంతో సోమవారం నాటి సభా కార్యక్రమాలను వాయిదా వేసినట్లు స్పీకర్ ప్రమీలా మల్లిక్ ప్రకటించారు. మంగళవారం నుంచి సభా కార్యక్రమాలు పూర్తి స్థాయిలో కొనసాగుతాయని తెలిపారు. అంతకుముందు సమావేశాలు పురస్కరించుకొని రాష్ట్ర గవర్నర్ శాసన సభకు విచ్చేశారు. ఈ సందర్భంగా ఆయనకు గౌరవ కవాతుతో స్వాగతించారు. అనంతరం స్పీకర్ ప్రమీలా మల్లిక్ సాదరంగా శాసన సభ సమావేశ హాల్‌కు తీసుకుని వెళ్లారు.

బీజేడీ ఎమ్మెల్యేల సమావేశం



పార్టీ ఎమ్మెల్యేలకు అభివాదం చేస్తున్న సీఎం నవీన్ పట్నాయక్

భువనేశ్వర్: శాసనసభ సమావేశాలు పురస్కరించుకొని ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ అధ్యక్షతన అధికార పక్షం బిజూ జనతా దళ్ ఎమ్మెల్యేల సమావేశం సోమవారం జరిగింది. 147 మంది సభ్యుల శాసనసభలో 110 మందితో బిజూ జనతా దళ్ ఏకైక బలమైన పార్టీగా ఈ 5 ఏళ్ల పాలన కొనసాగించింది. ఈ విడతలో 114 మంది సభ్యుల బలంతో బీజేడీ పాలన పగ్గాలు చేపట్టింది. 5 ఏళ్లలో క్రమంగా 4 మంది సభ్యుల బలం దిగజారింది. వీరిలో ముగ్గురిని పార్టీ క్రమశిక్షణ చర్యల కింద బహిష్కరించారు. మరో స్థానం మాజీ మంత్రి సూర్య నారాయణ పాత్రో మరణంతో ఖాళీ అయింది. ఈ లెక్కన 16వ శాసనసభ ముగిసే నాటికి సభలో బీజేడీ బలం 110గా ఉంది.

బీజేపీ ఎమ్మెల్యేల సమావేశం

భువనేశ్వర్: రాష్ట్ర శాసన సభలో మధ్యంతర బడ్జెటు సమావేశాలు పురస్కరించుకుని సోమవారం భారతీయ జనతా పార్టీ ఎమ్మెల్యేలు సమావేశమయ్యారు. రాష్ట్రంలో దిగజారిన రాజకీయ విలువలు, పెరుగుతున్న అత్యాచారాలు ప్రధాన శీర్షికలుగా ఈ సమావేశాల్లో చర్చించాలని తీర్మానించారు. బీజేపీ రాష్ట్ర శాఖ అధ్యక్షుడు మన్మోహన్ సామల్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో శాసన సభ విపక్షం చీఫ్ విప్ మోహన్ మాఝితో పాటు పార్టీ ఎమ్మెల్యేలు పాల్గొన్నారు.



రాష్ట్ర కార్యాలయంలో బీజేపీ ఎమ్మెల్యేల సమావేశం

స్వాగతికకు అభినందనలు

రాయగడ: స్థానిక మహిళా కళాశాలలో ప్లస్-త్రీ ఆర్ట్స్ ఫైనల్ ఇయర్ చదువుతున్న స్వాగతిక మల్లిక్ అనే ఎన్‌సీసీ విద్యార్థిని గత నెల 26వ తేదీన ఢిల్లీలో జరిగిన గణతంత్ర వేడుకల పరేడ్‌లో పాల్గొంది. ఆ విద్యార్థిని సోమవారం తిరిగి వచ్చిన సందర్భంగా కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు అభినందించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ అర్చనా మాట్లాడుతూ.. పరేడ్‌లో ప్రతిభ కనబరిచి ఎంతో గౌరవాన్ని తెచ్చిపెట్టిందని కొనియాడారు. కార్యక్రమంలో ఒడిశా ఎన్‌సీసీ బెటాలియన్ సుబేదార్ వినోద్, ఎన్‌సీసీ అధికారి రీతారాణి మిశ్రో తదితరులు పాల్గొన్నారు.



స్వాగతిక మల్లిక్‌ను అభినందిస్తున్న దృశ్యం

విశ్రాంత హోంగార్డుకు రూ. 4.20లక్షల చెక్కు

శ్రీకాకుళం క్రైమ్ : జిల్లా హోంగార్డు విభాగంలో పనిచేస్తూ గత నెలలో ఉద్యోగ విరమణ పొందిన సీహెచ్ జగదీశ్వరరావుకు సోమవారం ఉదయం జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ జీఆర్ రాధిక తన చేతుల మీదుగా రూ. 4.20 లక్షల చెక్కును అందజేశారు. ఎస్పీ మాట్లాడుతూ జగదీశ్వరరావు రెండో పట్టణ పీఎస్‌లో విధులు నిర్వర్తించేవారని జిల్లావ్యాప్తంగా ఉన్న తోటి హోంగార్డులు తమ ఒక్కరోజు వేతనాన్ని ఈ విధంగా అందజేశారని ఎస్పీ అన్నారు. ఉద్యోగ విరమణ పొందినప్పటికీ జిల్లా పోలీసు శాఖలో మీరు ఓ భాగమని, భవిష్యత్‌లో ఎలాంటి అవసరం ఉన్నా ఎల్లవేళలా తోడుగా ఉంటామని జగదీశ్వరరావుకు ఎస్పీ భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో హోంగార్డు ఎస్‌ఐ కేవీ నర్సింగరావు, కుటుంబసభ్యులు ఉన్నారు.



రూ. 4.20 లక్షల చెక్కును అందజేస్తున్న ఎస్పీ రాధిక

మల్లికార్జున స్వామికి తలపాగా తయారీ

ఎచ్చెర్ల: లావేరు మండలంలోని లావేరు గ్రామం పెద్దవీధిలో ఎప్పటిలాగానే ఈ సంవత్సరం కూడా శ్రీశైల భ్రమరాంబిక మల్లికార్జున స్వామికి తలపాగా సమర్పించేందుకు కాశిన వెంకటరమణ సోదరులు పని మొదలుపెట్టా రు. తలపాగా పూర్తయిన అనంతరం తిరువీధిగా ఊరేగించి మహాశివరాత్రి పర్వ దినాన శ్రీశైలం వెళ్లి సమర్పిస్తామని తెలిపారు.

సమస్యలపై ప్రత్యేక దృష్టి: వీసీ

ఎచ్చెర్ల క్యాంపస్: వర్సిటీ సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించనున్నట్లు బీఆర్‌ఏయూ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ కేఆర్ రజని అన్నారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయంలో నిర్వహించిన ఫోన్ ఇన్ లైవ్ డయల్ యువర్ యూనివర్సిటీ, గ్రీవెన్స్ ఫిర్యాదులపై అధికారులు, గ్రీవెన్స్ సెల్ కమిటీతో ఆమె సోమవారం సమీక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వచ్చిన ప్రతి ఫిర్యాదునూ సమీక్షించాలన్నారు. వ్యక్తిగత ప్రయోజనాల కంటే విద్యార్థులు, విశ్వవిద్యాలయం ప్రయోజనాలకు ప్రాధాన్యత ఇస్తూ ముందుకు సాగాల్సి ఉంటుందన్నారు. డిగ్రీ ఇయర్ ఎండ్ విద్యార్థుల కోసం స్పెషల్ డ్రైవ్ పరీక్షపై ప్రత్యేక దృష్టి పెట్టనున్నట్లు తెలిపారు. వర్సిటీ, వర్సిటీ అనుబంధ కళాశాలల్లో జవహర్ నాలెడ్జ్ సెంటర్, నైపుణ్య కేంద్రాలు, ప్లేస్‌మెంట్ సెల్‌లు ఏర్పాటుకు చర్యలు తీసుకోనున్నట్లు వివరించారు. అంబేడ్కర్ చైర్ ఏర్పాటు అంశం ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లనున్నట్లు వివరించారు. ఔట్‌సోర్సింగ్ నియామకాలపై వచ్చిన ఫిర్యాదులపైనా సమీక్షించారు. కోర్టులో వ్యవహారం ఉండటం వల్ల స్టాండింగ్ కమిటీ, న్యాయ నిపుణులు సూచనలు పాటించి ముందుకు సాగనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ప్రొఫెసర్ బి.అడ్డయ్య, ప్రిన్సిపాళ్లు ఎస్.ఉదయ్‌భాస్కర్, సీహెచ్ రాజశేఖర్‌రావు, కాన్ఫిడెన్షియల్ ఎగ్జామినేషన్స్ డీన్ అనురాధ, గ్రీవెన్స్ సెల్ అధ్యక్షురాలు యు.కావ్యజ్యోత్స్న పాల్గొన్నారు.



ఫిర్యాదులపై అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ కేఆర్ రజని

అయోధ్య-కాశీ యాత్రకు ఆర్టీసీ ప్రత్యేక బస్సు

శ్రీకాకుళం అర్బన్: శ్రీకాకుళం ఆర్టీసీ కాంప్లెక్స్ నుంచి అయోధ్య-కాశీ యాత్రకు ఏపీఎస్ ఆర్టీసీ శ్రీకాకుళం నుంచి ప్రత్యేక బస్సు నడిపేందుకు ఏపీఎస్ ఆర్టీసీ అన్ని రకాల చర్యలు చేపట్టిందని ఆర్టీసీ శ్రీకాకుళం ఒకటో డిపో మేనేజర్ ఎ.మల్లికార్జునరాజు అన్నారు. అయోధ్య-కాశీ యాత్రకు సంబంధించిన పోస్టర్‌ను సోమవారం శ్రీకాకుళంలోని ఆర్టీసీ కాంప్లెక్స్‌లో ఆర్టీసీ అధికారులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మల్లికార్జునరాజు మాట్లాడుతూ ఈనెల 18వ తేదీ నుంచి 27వ తేదీ వరకూ అయోధ్య-కాశీ యాత్ర పేరిట వివిధ పుణ్యక్షేత్రాలను 10 రోజులలో దర్శింపజేసే సదవకాశాన్ని ఆర్టీసీ చేపట్టిందన్నారు. ఇందుకోసం ఆర్టీసీ ప్రత్యేక ప్యాకేజీ రూపొందించినట్లు తెలిపారు. అయోధ్య-కాశీ సంపూర్ణ యాత్రను భక్తులు దర్శించుకునేందుకు వీలుగా ఏపీఎస్ ఆర్టీసీ సూపర్‌లగ్జరీ బస్సు నడపనుందని తెలిపారు. మనిషి ఒక్కొక్కరికి ప్రయాణ చార్జీ రూ.12వేలుగా నిర్ణయించినట్లు తెలిపారు. ఈ యాత్రలో 10రోజుల పాటు ఆర్టీసీ బస్సులో ప్రయాణించే భక్తులకు ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం భోజనం, రాత్రి టిఫిన్‌ను ఆర్టీసీయే సమకూరుస్తుందని తెలిపారు. కాశీలో రూమ్ అకామిడేషన్, పడవ ప్రయాణ ఖర్చులు మాత్రం యాత్రికులే భరించుకోవాల్సి ఉంటుందన్నారు.

ఈ యాత్రకు సంబంధించి ప్రయాణికులకు, భక్తులకు పూర్తిస్థాయిలో అవగాహన కల్పించనున్నట్లు తెలిపారు. వివరాలకు 7382921647, 7382919694, 7382919696, 9959225608 నంబర్లకు సంప్రదించాలని మల్లికార్జునరాజు తెలిపారు. కార్యక్రమంలో ఆర్టీసీ శ్రీకాకుళం ఒకటో డిపో అసిస్టెంట్ మేనేజర్ వి.రమేష్, ఎస్‌ఎం నరేంద్ర, ఓపీఆర్‌ఎస్ సూపర్‌వైజర్ ఎండీఏ భాషా, ఏడీసీ రాజు, ఎంపీ రావు, కె.సుమన్ తదితరులు ఉన్నారు.



అయోధ్య-కాశీ యాత్రకు సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఆర్టీసీ అధికారులు

అక్రమ రవాణాకు అడ్డుకట్ట

ఇచ్ఛాపురం: ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు మద్యం, డబ్బు వంటివి అక్రమంగా రవాణా చేయకుండా అడ్డుకుంటామని డిప్యూటీ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ (డీటీసీ) ఎ.చంద్రశేఖర్ రెడ్డి తెలిపారు. డీటీసీగా బాధ్యతలు స్వీకరించిన అనంతరం పురుషోత్తపురం వద్ద ఇంటిగ్రేటెడ్ చెక్‌పోస్టుని ఆయన సోమవారం సందర్శించారు. అనంతరం విలేకరులతో మాట్లాడారు. సరిహద్దుల్లో ప్రత్యేక చెక్‌పోస్టులు ఏర్పాటు చేశామని చెప్పారు. కలెక్టర్ సూచనలతో ప్రత్యేక దృష్టి సారిస్తున్నామన్నారు. వాహన చోదకులు, యజమానులు మధ్యవర్తితో ప్రమేయం లేకుండా రవాణా కార్యాలయానికి వచ్చి పనులు చేసుకోవాలన్నారు. ఎక్కడా పర్మిట్ల కోసం నగదు చెల్లించాల్సిన అవసరం లేదని, అన్నీ నగదు రహిత లావాదేవీలు జరుగుతున్నాయని తెలిపారు. కార్యక్రమంలో ఎంవీఐ వి.వెంకటరావు, ఏఎంవీఐలు యు దుర్గాప్రసాద్, కె.పార్వతి, అమృత ఎంవీఐ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాలు నివారిద్దాం

పురుషోత్తపురం ఇంటిగ్రేటెడ్ చెక్‌పోస్టు ఆవరణలో డీటీసీ డ్రైవర్లతో సమావేశమయ్యారు. రోడ్డు ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. అనంతరం డ్రైవర్లు, క్లీనర్లతో ప్రతిజ్ఞ చేయించారు.



మాట్లాడుతున్న డీటీసీ చంద్రశేఖర్‌రెడ్డి

రూ.1.20కోట్లతో రైల్వేస్టేషన్ల అభివృద్ధి

పాతపట్నం: పాతపట్నం, టెక్కలి రైల్వేస్టేషన్లను రూ.1.20కోట్లతో అభివృద్ధి చే స్తున్నట్లు రైల్వే అధికారులు తెలిపారు. గత పది రోజులుగా పాతపట్నం రైల్వే స్టేషన్ ప్లాట్ ఫారం ఎత్తు రెండు అడుగులు పెంచుతూ పనులు చేపడుతున్నా రు. గతంలో రైలు బండి ఎక్కాలంటే రైల్వే ప్లాట్ ఫారం కిందకు ఉండడంతో వృద్ధులు, చిన్నారులు ఇబ్బందులు పడేవారు. పాతపట్నం రైల్వేస్టేషన్ ప్లాట్ ఫారంలో ప్రస్తుతం మట్టి నింపుతున్నామని, కాంక్రీట్, టైల్స్ వేస్తామన్నారు. టెక్కలి ప్లాట్ ఫారం పనులు దాదాపు 70 శాతం పూర్తయ్యాయని తెలిపారు.

'కృష్ణను దాటారు'

శ్రీకాకుళం న్యూకాలనీ: కృష్ణా జిల్లా ఆక్వా వెల్ఫేర్ అసోసియేషన్ నిర్వహించిన కృష్ణా రివర్ పాసింగ్ పోటీల్లో జిల్లాకు చెందిన రాకోటి కిశోర్, కనుగుల చంద్రబాను, కొర్ను వెంకటరావులు పాల్గొన్నారు. ఈ పోటీల్లో కొర్ను వెంకటరావు బంగారు పతకం సాధించారు. ఆయన ఏటా మన జిల్లా తరఫున పాల్గొని మెడల్ సాధిస్తూ వస్తున్నారు. జిల్లాకు చెందిన వెంకటరావు సెక్షన్ ఆఫీసర్, జనరల్ అడ్మినిస్ట్రేషన్ డిపార్ట్‌మెంట్, ఆంధ్రప్రదేశ్ ఏపీ సెక్రటేరియట్, అమరావతిలో పనిచేస్తున్నారు. రాకోటి కిశోర్, కనుగుల చంద్రబాను బెస్ట్ ఫినిషర్‌లుగా నిలిచారు. ఈ కార్యక్రమంలో భారత క్రికెట్ కంట్రోల్ బోర్డ్ సెలెక్షన్ కమిటీ మాజీ చైర్మన్ ఎంఎస్‌కే ప్రసాద్, పార్లమెంట్ మాజీ సభ్యులు గోకరాజు గంగరాజు విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. జిల్లా క్రీడాకారులకు రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి ధర్మాన ప్రసాదరావు, మాజీ డిప్యూటీ సీఎం, రాష్ట్ర ఒలింపిక్ అసోసియేషన్ అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్, ఆంధ్రప్రదేశ్ లైఫ్ సేవింగ్ సొసైటీ ఫౌండర్ నేషనల్ మెడలిస్ట్ స్విమ్మింగ్ కోచ్ షేక్ సుభం, ప్రెసిడెంట్ సీహెచ్ వెంకట్, వైస్ ప్రెసిడెంట్ తృప్తి రిసార్ట్ అధినేత తిరుపతిరాజు, రాష్ట్ర మస్టర్ స్విమ్మింగ్ అసోసియేషన్ ఉపాధ్యక్షులు దుప్పల వెంకటరావు, ప్రెసిడెంట్ ఉమామహేశ్వరరావు, సెక్రటరీ రాజారావు, బాలాజీ, సీనియర్ క్రీడాకారులు అభినందించారు.



పతకాలతో క్రీడాకారులు

ప్రజ్ఞా వికాస పరీక్ష ప్రశ్న పత్రం విడుదల

శ్రీకాకుళం న్యూకాలనీ: పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు విద్యార్థులు ప్రణాళికాబద్ధంగా సన్నద్ధమైతే వంద శాతం ఉత్తీర్ణత సాధ్యమేనని శ్రీకాకుళం ఉప విద్యాశాఖాధికారి ఆర్.విజయకుమారి పేర్కొన్నారు. శ్రీకాకుళం నగరంలోని బలగ మున్సిపల్ హైస్కూల్లో ఎస్‌ఎఫ్‌ఎస్‌ఐ ఆధ్వర్యంలో జిల్లావ్యాప్తంగా ఫిబ్రవరి 6 నుంచి 8 వరకు మూడు రోజుల పాటు జరగనున్న పదో తరగతి ప్రజ్ఞ వికాస్ పరీక్షలకు సంబంధించిన ప్రశ్న పత్రాలను విజయకుమారితోపాటు విశ్రాంత డిప్యూటీ ఈఓ కొత్తకోట అప్పారావు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు మురళీకృష్ణ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా డిప్యూటీ ఈఓ విజయకుమారి మాట్లాడుతూ ఎస్‌ఎఫ్‌ఎస్‌ఐ ఆధ్వర్యంలో జరుగుతున్న ప్రజ్ఞా వికాస పరీక్షను విద్యార్థులు ఉపయోగించుకోవాలని సూచించారు. ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి హరీష్ మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రభుత్వ బడుల్లో విద్యాభివృద్ధికి పెద్దపీట వేస్తున్న నేపథ్యంలో ప్రభుత్వ బడుల్లోనే విద్యార్థులను చేర్పించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు డి.చందు, బాలికల కన్వీనర్ రేవతి, జిల్లా కమిటీ సభ్యులు తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

పొగమంచుతో అవస్థలు

పొగమంచుతో జనం అవస్థలు పడుతున్నారు. గడిచిన రెండు రోజులుగా వేకువన దట్టంగా పొగమంచు కురుస్తోంది. కంచిలిలో ఇలా దారులు కూడా కనబడలేదు. – కంచిలి



రైల్వేస్టేషన్‌లో పొగమంచు



కంచిలి మెయిన్ రోడ్డులో ఆవహించిన పొగమంచు



క్లుప్తంగా

పామాయిల్ తోటలో ఏనుగుల బీభత్సం


పాడైన పామాయిల్ మొక్కను చూపిస్తున్న రైతు గుంపస్వామి నాయుడు

జియ్యమ్మవలస: మండలంలోని బిత్రపాడు సచివాలయం పరిధిలో బిత్రపాడు, బట్లభద్ర పంట పొలాల్లో సోమవారం ఏనుగులు బీభత్సం సృష్టించాయి. పామాయిల్ తోటలో 69 మొక్కలను ధ్వంసం చేశాయని బిత్రపాడు గ్రామానికి చెందిన రైతు నీరస గుంపస్వామినాయుడు వాపోయాడు. మొక్క వేసి రెండు సంవత్సరాలు గడిచిందని, మరో సంవత్సరంలో గెలలు తెగుతాయని తెలిపాడు. గ్రామంలోని చాలామంది రైతులకు చెందిన పామాయిల్, అరటి తోటలను ధ్వంసం చేశాయని తెలిపారు. అటవీసిబ్బంది వాటిని తరలించే ప్రయత్నం చేయాలని రైతులు కోరుతున్నారు.

అంతర్ రాష్ట్ర చెక్‌పోస్టుల వద్ద నిఘా


అంతర్‌రాష్ట్ర చెక్‌పోస్టును తనిఖీచేస్తున్న ఎస్పీ విక్రాంత్ పాటిల్

పార్వతీపురంటౌన్: అంతర్‌రాష్ట్ర చెక్‌పోస్టుల వద్ద మరింత నిఘా పెంచామని పార్వతీపురం మన్యం జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ అన్నారు. ఈ మేరకు సోమవారం ఆయన పార్వతీపురం మండలంలోని ఆర్‌కే బట్టివలస సమీపంలో ఏర్పాటు చేసిన అంతర్‌రాష్ట్ర చెక్‌పోస్టును పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రానున్న సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఒడిశా రాష్ట్రం నుంచి సారా, గంజాయి, మాదక ద్రవ్యాల రవాణాపై ప్రత్యేక నిఘా పెట్టి భద్రతను పెంచామన్నారు. పార్వతీపురం మన్యం జిల్లా పరిధిలో 10 అంతర్‌రాష్ట్ర చెక్‌పోస్టులను ఏర్పాటు చేశామని ఒడిశా నుంచి మాదక ద్రవ్యాల అక్రమ రవాణా, పాత నేరస్తుల కదలికలపై ప్రత్యేక నిఘా పెట్టామని తెలిపారు. ఈ చెక్‌పోస్టుల వద్ద అన్ని రకాల వాహనాలను తనిఖీచేస్తున్నామన్నారు. పోలీసు సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని, వాహనాలన్నింటినీ క్షుణ్ణంగా తనిఖీచేయాలని కోరారు. అనుమానం ఉన్న, ముందస్తు సమాచారం ఉన్న వాహనాలపై తక్షణమే ఉన్నతాధికారులకు సమాచారం అందించాలని సూచించారు.

పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలి

- కలెక్టర్ నాగలక్ష్మి


మాట్లాడుతున్న కలెక్టర్ నాగలక్ష్మి, జేసీ కార్తీక్

విజయనగరం అర్బన్: పదోతరగతి, ఇంటర్‌మీడియట్ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించేందుకు తగిన ఏర్పాట్లు చేయాలని అధికారులను కలెక్టర్ నాగలక్ష్మి ఆదేశించారు. సంబంధిత శాఖల అధికారులంతా సమన్వయంతో ఈ ప్రక్రియను పూర్తి చేయాలని సూచించారు. పది, ఇంటర్‌మీడియట్ పరీక్షల నిర్వహణ గురించి వివిధ శాఖల అధికారులతో కలెక్టరేట్ ఆడిటోరియంలో సోమవారం ఆమె సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వచ్చే నెల 1వ తేదీ నుంచి ఇంటర్‌మీడియట్, 18 నుంచి పదోతరగతి వార్షిక పరీక్షలు ప్రారంభం కానున్నాయని తెలిపారు. ఇంటర్‌మీడియట్ ఒకేషనల్ ప్రాక్టికల్ పరీక్షలు సోమవారం ప్రారంభమయ్యాయని, ఇక నుంచి వరుసగా పరీక్షలు జరుగుతాయని చెప్పారు. పదోతరగతి పరీక్షలకు సుమారు 27,277 మంది హాజరవుతారని వారికోసం జిల్లా వ్యాప్తంగా 129 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు.

94 పరీక్షా కేంద్రాల ఏర్పాటు

పరీక్షల నిర్వహణకు సుమారు 1,600 మంది ఇన్విజిలేటర్లు, 9 ఫ్లయింగ్ స్క్వాడ్‌లను ఏర్పాటు చేశామన్నారు. ఇంటర్‌మీడియట్ పరీక్షల కోసం సుమారు 45 వేల మంది హాజరు కానున్నారని, అందుకోసం 94 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్‌ను అమలు చేయాలని చుట్టుపక్కల జిరాక్స్, ఇంటర్నెట్ సెంటర్లను మూసివేయాలని ఆదేశించారు. విద్యార్థులకు తాగునీటి సదుపాయం కల్పించాలని చెప్పారు. రానున్న వేసవిని దృష్టిలో పెట్టుకుని కేంద్రాల వద్ద వైద్యబృందాలను, అవసరమైన మందులను అందు బాటులో ఉంచాలన్నారు. పరీక్ష జరిగే సమయంలో విద్యుత్ సరఫరాకు అంతరాయం లేకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అలాగే పరీక్షా పత్రాలను ఉంచే స్ట్రాంగ్ రూమ్‌లవద్ద, రూట్లలో, పరీక్షా కేంద్రాల వద్ద తగిన పోలీసు బదోబస్తు ఏర్పాటు చేయాలని, విద్యార్థుల పరీక్ష సమయానికి అనుగుణంగా ఆర్‌టీసీ బస్సుల వేళలను సవరించాలని సూచించారు. పరీక్షల నిర్వహణను ఏడు శాఖల అధికారులు సమన్వయంతో విజయవంతంగా పూర్తి చేయాలని ఆదేశించారు. సమావేశంలో జేసీ కె.కార్తీక్, అసిస్టెంట్ కలెక్టర్ వెంకటత్రివినాగ్, డీఈఓ బి.లింగేశ్వరరెడ్డి, ప్రాంతీయ ఇంటర్‌మీడియట్ అధికారి మజ్జి ఆదినారాయణ, డీవీఈఓ భీమశంకర్, డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఎస్.భాస్కరరావు, ట్రాన్స్‌కో ఎస్ఈ లక్ష్మణరావు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

వినతుల పరిష్కారంపై ప్రత్యేక శ్రద్ధ

- కలెక్టర్ నాగలక్ష్మి

విజయనగరం అర్బన్: జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో వివిధ సమస్యలపై ప్రభుత్వ శాఖలకు ప్రజల నుంచి అందిన వినతులను పరిశీలించి ప్రత్యేక శ్రద్ధ పెట్టి వాటిపై స్పందించాలని అధికారులకు కలెక్టర్ నాగలక్ష్మి సూచించారు. ఈ మేరకు కలెక్టరేట్‌లోని ఆడిటోరియంలో సోమవారం నిర్వహించిన వినతుల స్వీకరణ కార్యక్రమంలో జేసీ కె.కార్తీక్, డీఆర్‌ఓ ఎస్‌డీ అనిత, ట్రైనీ అసిస్టెంట్ కలెక్టర్ బీఎస్‌వీత్రివినాగ్‌లతో కలిసి కలెక్టర్ నాగలక్ష్మి వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా వివిధ సమస్యలపై 200 వినతులు అందాయి. వాటిలో అత్యధికంగా రెవెన్యూశాఖ సమస్యలపై 132, డీఆర్‌డీఏకు సంబంధించి 26, గ్రామ వార్డు సచివాలయాల శాఖకు 13, మునిసిపల్ సమస్యలపై 9, పంచాయితీ విభాగానికి 8, గృహ నిర్మాణ శాఖకు 7, జిల్లా ఆసుపత్రుల సేవలకు సంబంధించి 3, ఏపీవిద్యుత్ పంపిణీ సంస్థకు సంబంధించి 2 వినతులు ఉన్నాయి. ప్రత్యేక డిప్యూటీ కలెక్టర్‌లు మురళీకృష్ణ, కేఆర్‌ఆర్‌సీ డిప్యూటీ కలెక్టర్ సుమబాల తదితరులు వినతుల స్వీకరణలో పాల్గొన్నారు.


వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ నాగలక్ష్మి, జేసీ కె.కార్తీక్

వినతులకు శాశ్వత పరిష్కారం

పార్వతీపురం: జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో వచ్చిన వినతులకు శాశ్వత పరిష్కారం చూపాలని పార్వతీపురం మన్యం జిల్లా కలెక్టర్ నిషాంత్‌కుమార్ మండల అధికారులను ఆదేశించారు. ఈ మేరకు సోమవారం కలెక్టరేట్‌లోని సమావేశమందిరంలో నిర్వహించిన జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో కలెక్టర్‌తోపాటు ఐటీడీఏ పీఓ సి.విష్ణుచరణ్, కేఆర్‌సీసీ డిప్యూటీ కలెక్టర్ కేశవ నాయుడు ప్రజలనుంచి వినతులను స్వీకరించారు. ప్రజల నుంచి వచ్చిన వినతుల పరిష్కారం కోసం సంబంధిత అధికారులతో మాట్లాడి సకాలంలో పరిష్కరించాలని సూచించారు. జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో ప్రజలు సామాజిక, వ్యక్తిగత అంశాలపై సమర్పించిన 185 అర్జీలను కలెక్టర్ స్వీకరించారు. సమావేశంలో ఆర్‌డబ్ల్యూఎస్ ఇంజినీరింగ్ అధికారి ఒ.ప్రభాకర రావు, జిల్లా వ్యవసాయ అధికారి కె.రాబర్ట్‌పాల్, బీసీ వెల్ఫేర్ అధికారి ఎస్.కృష్ణ, డ్వామా పీడీ కె.రామచంద్రరావు, డీపీఓ బి.సత్యనారాయణ, డీఈఓ ఎన్.ప్రేమ్‌కుమార్, జిల్లా ప్రణాళికా అధికారి పి. వీరరాజు, జిల్లా రవాణాధికారి సి.మల్లికార్జునరెడ్డి, డీఎంహెచ్‌ఓ బి.జగన్నాథరావు, ఐసీడీఎస్ పీడీ నూర్జహాన్ రాణి తదితరులు పాల్గొన్నారు.


బాధితుల నుంచి ఫిర్యాదులు స్వీకరిస్తున్న ఎస్పీ ఎం.దీపిక


పార్వతీపురం టౌన్: అర్జీదారుల సమస్యలు అడిగి తెలుసుకుంటున్న ఎస్పీ విక్రాంత్ పాటిల్

స్పందన ఫిర్యాదులకు తక్షణ పరిష్కారం

విజయనగరం క్రైమ్: స్పందన కార్యక్రమానికి వచ్చే ఫిర్యాదులను తక్షణమే పరిష్కరించాలని విజయనగరం ఎస్పీ ఎం.దీపిక పోలీస్ అధికారులకు ఆదేశాలు జారీచేశారు. జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం ఆమె స్పందన కార్యక్రమం నిర్వహించి బాధితుల నుంచి 39 ఫిర్యాదులను స్వీకరించి, వాటి పరిష్కారానికి చర్యలు చేపట్టారు. బాధితుల సమస్యలను తెలుసుకుని, సంబంధిత పోలీసు అధికారులతో వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడి, ఫిర్యాదుదారుల సమస్యల పరిష్కారానికి చట్టపరిధిలో చర్యలు చేపట్టి, న్యాయం చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ అస్మా ఫర్హీన్, ట్రైనీ ఐపీఎస్ మండా జావలి అల్ఫోన్స్, డీటీసీ డీఎస్పీ వీరకుమార్, ఎస్బీ సీఐలు కేకేవీ.విజయనాథ్, ఈ.నరసింహమూర్తి, ఎస్సై ప్రభావతి పాల్గొన్నారు.


వినతులను స్వీకరిస్తున్న కలెక్టర్ నిషాంత్‌కుమార్

ఫిర్యాదులపై సత్వర న్యాయం

పార్వతీపురంటౌన్: స్పందన కార్యక్రమంలో బాధితులు అందజేసే ఫిర్యాదులపై సత్వర న్యాయం జరగాలని పార్వతీపురం మన్యం జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ అన్నారు. ఈ మేరకు ప్రజా సమస్యల పరిష్కార వేదిక స్పందన కార్యక్రమాన్ని సోమవారం ఆయన నిర్వహించి జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ఫిర్యాదుదారుల నుంచి అర్జీలను స్వీకరించి, వారితో ముఖాముఖి మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వేధింపులు, కుటుంబ కలహాలు, సివిల్ తగాదాలు, ఇతర సమస్యలపై ఫిర్యాదు దారులు విన్నవించుకోగా, వారి సమస్యలపై సంబంధిత పోలీసు అధికారులతో ఎస్పీ స్వయంగా ఫోన్‌లో మాట్లాడి సత్వర న్యాయం అందించేలా కృషి చేయాలని స్పష్టం చేశారు. బాధితులకు చట్ట పరిధిలో తక్షణ న్యాయం అందించేలా చర్యలు తీసుకుని, తీసుకున్న చర్యలకు సంబంధించిన నివేదికను జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయానికి పంపాలని అధికారులను ఆదేశించారు. సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని హితవు పలికారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ డాక్టర్ ఒ.దిలీప్ కిరణ్, ఎస్బీ సీఐ సీహెచ్ లక్ష్మణ రావు సిబ్బంది పాల్గొన్నారు.

శాంతిభద్రతల పరిరక్షణలో ‘ఆర్మ్‌డ్’ పాత్ర కీలకం

- పునశ్చరణ తరగతులు ప్రారంభించిన అదనపు ఎస్పీ

విజయనగరం క్రైమ్: ఆర్మ్‌డ్ రిజర్వ్ పోలీసుల పాత్ర శాంతి భద్రతల పరిరక్షణలో చాలా కీలకమైనదని జిల్లా అదనపు ఎస్పీ అస్మా ఫర్హీన్ పేర్కొన్నారు. ఏటా 15 రోజుల పాటు ఆర్మ్‌డ్ రిజర్వ్ పోలీసులకు నిర్వహించే పునశ్చరణ తరగతులను ఆమె సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పోలీసు విధులను నిర్వహించినప్పుడు నిష్పక్షపాతంగా, అంకితభావం, నిజాయితీతో వ్యవహరించి, ప్రజలకు మరింత చేరువ కావాలని సూచించారు. విధుల్లో నైపుణ్యం సాధించేందుకు ఆర్మ్‌డ్ రిజర్వ్ పోలీసులకు ప్రతి ఏడాదీ నిర్వహించే పునశ్చరణ తరగతులను సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. తరగతులు ఫిబ్రవరి 5 నుంచి 19 వరకూ నిర్వహిస్తామని తెలిపారు. యూనిఫాం ధరించిన తర్వాత ప్రజల ధన, మాన ప్రాణాల రక్షణకే పోలీసులు పునరంకితం కావాలని హితవు పలికారు. ప్రస్తుత పరిస్థితులు, అవసరాల దృష్ట్యా ఈ మొబిలైజేషన్‌లో ఏఆర్ పోలీసులు ఒత్తిడిని జయించేందుకు యోగా, వ్యక్తిత్వ వికాసం, ఆరోగ్య, ఆర్థిక పరిస్థితులను మెరుగుపర్చేందుకు ప్రణాళికాయుతంగా కొన్ని కార్యక్రమాలను నిర్వహిస్తామని చెప్పారు. వృత్తిపరమైన నైపుణ్యాన్ని పెంపొందించేందుకు శారీరక దారుఢ్యం పెంచేందుకు, వివిధ ఆయుధాల ఉపయోగాలను, ముఖ్యమైన బందోబస్తు విధులను ఏ విధంగా నిర్వహించాలో, ఫైరింగ్ ప్రాక్టీస్, బాంబ్ స్క్వాడ్ పనితీరు ఏ విధంగా చేపట్టాలో, మస్కెట్రీ శిక్షణ అందించనున్నామన్నారు. కార్యక్రమంలో ఏఆర్ డీఎస్పీ యూనివర్స్, ఆర్ఐ టి.శ్రీనివాసరావు, ఆర్ఎస్సైలు నారాయణరావు, రామకృష్ణ, శ్రీనివాసరావు, ప్రసాదరావు, నీలిమ, కేశవరావు, అక్షయ్‌కుమార్, విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాలకు చెందిన పలువురు ఏఆర్ ఎస్సైలు, హెచ్‌సీలు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



పునశ్చరణ తరగతుల్లో మాట్లాడుతున్న అదనపు ఎస్పీ అస్మా ఫర్హీన్

179 మద్యం సీసాల పట్టివేత


చీపురుపల్లి: పట్టుబడిన మద్యం బాటిల్స్, నిందితులతో ఎస్సై, సిబ్బంది


రామభద్రపురం: మద్యం బాటిల్స్‌తో పట్టుబడిన నిందితుడితో ఎస్సై జ్ఞానప్రసాద్, ఏఎస్సై అప్పారావు

చీపురుపల్లి: మద్యం అక్రమంగా రవాణా చేస్తున్న ఇద్దరు వ్యక్తులను చీపురుపల్లి మండలంలోని ఇటకర్లపల్లి గ్రామంలో అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్సై కె.కిరణ్‌కుమార్ నాయుడు చెప్పారు. ఈ మేరకు సోమవారం ఆయన తెలిపిన వివరాల మేరకు ఇటకర్లపల్లి గ్రామంలో తనిఖీలు నిర్వహిస్తుండగా ఇద్దరు వ్యక్తులు ద్విచక్ర వాహనంపై 179 మద్యం బాటిల్స్ అక్రమంగా తరలిస్తూ పట్టుబడ్డారు. దీంతో అక్రమంగా రవాణా చేస్తున్న మద్యం బాటిల్స్‌ను, ద్విచక్ర వాహనాన్ని సీజ్ చేసి పట్టుబడిన ఇద్దరు వ్యక్తులపై కేసు నమోదు చేశారు.

రామభద్రపురంలో 23 మద్యం బాటిల్స్

రామభద్రపురం: మండలకేంద్రంలో సోమవారం ఓ వ్యక్తి అక్రమంగా తరలిస్తున్న మద్యబాటిల్స్‌ను సిబ్బందితో కలిసి ఎస్సై జ్ఞానప్రసాద్ పట్టుకున్నారు. దీనిపై ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం దత్తిరాజేరు మండలం కోరపుకొత్తవలస గ్రామానికి చెందిన ఓ వ్యక్తి 28 మద్యం బాటిల్స్ అక్రమంగా తీసుకువెళ్తుండగా పట్టుబడ్డాడు. దీంతో మద్యం బాటిల్స్ స్వాధీనం చేసుకుని నిందితుడిపై కేసు నమోదు చేశారు.

ఎల్.కోటలో 25 మద్యం సీసాలు

లక్కవరపుకోట: మండలంలోని గేదెలవానిపాలెం పంచాయతీ శివారు వేచలపువానిపాలెం గ్రామానికి చెందిన యు.ఎస్.రామారావు అక్రమంగా 25 మంద్యం సీసాలను తరలిస్తుండగా ఎస్సై ఆర్.గోపాలరావు ఆధ్వర్యంలో పోలీసులు సోమవారం పట్టుకున్నారు. ఈ సందర్భంగా మద్యం సీసాలను స్వాధీనం చేసుకుని నిందితుడిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

విద్యార్థులకు చట్టాలపై అవగాహన అవసరం

సీతంపేట: విద్యార్థులు పలు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని పాలకొండ జూనియర్ సివిల్‌కోర్టు న్యాయమూర్తి ఎ.విజయకుమార్ అన్నారు. ఈ మేరకు సోమవారం ఆయన సీతంపేటలోని ప్రభుత్వోన్నత పాఠశాలలో న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించారు. పోక్సో, జువైనల్ చట్టాల గురించి విద్యార్థులకు వివరించారు. ప్రతి నెలా లీగల్ లిటరసీ క్లబ్ నిర్వహించాలని ఉపాధ్యాయుడు ప్రాణిగ్రహికి సూచించారు. కార్యక్రమంలో పాలకొండ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు జి.సత్యంనాయుడు, న్యాయవాదులు ఎం.శామ్యూల్, ఆర్.కుమారస్వామి, కిరణ్మయి, హెచ్‌ఎం హేమసుందర్, ఉపాధ్యాయులు గోవిందనాయుడు, శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న జూనియర్ సివిల్ కోర్టు న్యాయమూర్తి

నేడు శంబర పోలమాంబ మూడో జాతర

మక్కువ: ఉత్తరాంధ్రుల ఇలవేల్పు శంబర పోలమాంబ అమ్మవారు మూడవ జాతర మంగళవారం జరగనుంది. జాతరకు వచ్చే భక్తుల సౌకర్యార్థం ఈవో వీవీ సూర్యనారాయణ పర్యవేక్షణలో ఏర్పాట్లు చేపట్టారు. భక్తులకు అవసరమైన లడ్డు, పులిహార ప్రసాదాలను తయారు చేయించారు.

జాతరకు వచ్చిన భక్తులు ఇబ్బందులు పడకుండా సీఐ జి.బాలకృష్ణ, ఎస్సై నరసింహమూర్తి ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు నిర్వహించనున్నారు.

జాతీయస్థాయి సైక్లింగ్ పోటీలకు తోండ్రంగి విద్యార్థులు


సైక్లింగ్ పోటీలకు ఎంపికైన విద్యార్థులు

చీపురుపల్లిరూరల్(గరివిడి): గరివిడి మండలంలోని తోండ్రంగి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు జాతీయస్థాయి సైక్లింగ్ పోటీల్లో ప్రాతినిధ్యం వహించనున్నారు. డిసెంబర్‌లో జరిగిన ఏపీ స్టేట్ సైక్లింగ్ చాంపియన్‌షిప్ పోటీల్లో పాఠశాలకు చెందిన విద్యార్థినులు జమ్ము భవాని, చింతపల్లి ప్రవల్లిక, జమ్ము వెన్నెల, నిద్దాన జ్యోషిత, పొట్నూరు థెరిసాతో పాటు చీపురుపల్లిలోని ప్రైవేట్ కళాశాలకు చెందిన పి.నానాజీ, వాల్లె హరిప్రసాద్‌లు ప్రతిభ కనబరిచి బంగారు పతకాలు సాధించి జాతీయస్థాయి పోటీలకు అర్హత సాధించారు. ఫిబ్రవరి 8 నుంచి 13 వరకు జార్ఖండ్ రాష్ట్ర రాజధాని రాంచీలో జరగనున్న జాతీయస్థాయి సైక్లింగ్ పోటీల్లో ఈ విద్యార్థినులు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం తరఫున ప్రాతినిధ్యం వహించనున్నారు. జాతీయస్థాయి పోటీల్లో ప్రాతినిధ్యం వహించనున్న విద్యార్థినులను పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఏవీ.రమణరాజు, వ్యాయామ ఉపాధ్యాయుడు టి.సత్యనారాయణ అభినందించారు.

ఆటో బోల్తా: 18 మందికి గాయాలు

సీతంపేట: మినుముల పంట తీతకు వెళ్తున్న కూలీల ఆటో బోల్తా పడిన సంఘటనలో 18 మందికి గాయాలయ్యాయి. వివరాలిలా ఉన్నాయి. కొత్తూరు మండలంలోని మహిసింగి ఆర్ఆర్ కాలనీకి చెందిన కె.హేమలత, ఢిల్లీశ్వరి, జి.ప్రసాదరావు, కె.పద్మావతి, కె.గంగమ్మ, ఎన్.దాలమ్మ, టి.సంజీవమ్మ, కె.రమణమ్మ, జి.అమ్మన్నమ్మ, ఎ.సరోజనమ్మ, జి.సరస్వతి, పి.అప్పలస్వామి, కె.గౌరమ్మ తదితరులు ఆటోలో పాలకొండ మండలం లక్కుపురం వెళ్తుండగా సీతంపేట యూత్ ట్రైనింగ్ సెంటర్ వద్దకు వచ్చేసరికి ఆటో అదుపుతప్పి బోల్తా పడింది. పాలకొండ నుంచి కొత్తూరు వస్తున్న 108 సిబ్బంది ఈఎంటీ రాములు, పైలెట్ మోహన్‌రావులు ఘటన చూసి క్షతగాత్రులకు వెంటనే సపర్యలు చేసి స్థానిక ఏరియా ఆస్పత్రిలో చేర్పించారు. గాయపడిన వారికి సూపరింటెండెంట్ బి.శ్రీనివాసరావు నేతృత్వంలో వైద్యసిబ్బంది ఎక్స్‌రేలు తీసి వైద్యం అందజేయగా కొంతమంది కోలుకున్నారు. క్షతగాత్రుల్లో హేమలత, లక్ష్మి, దాలమ్మలకు తలపై గాయాలు కావడంతో రిమ్స్‌కు రిఫర్ చేశారు.

ఆర్టీసీ బస్సు ఢీకొని 12 మందికి..

వంగర: మండల పరిధి రుషింగి–చినరాజులగుమ్మడ గ్రామాల మధ్య రైస్‌మిల్లు సమీపంలో ఆర్టీసీ బస్సు–ఆటో ఢీకొనడంతో 12 మంది గాయాల పాలయ్యారు. సోమవారం సాయంత్రం ఆర్టీసీ బస్సు రాజాం నుంచి రుషింగి మీదుగా జేకేగుమ్మడ వెళ్తుండగా..రాజులగుమ్మడ పంటపొలాల్లో చెరకు కటింగ్ పనులు పూర్తి చేసుకున్న రైతు కూలీలు ఆటోలో స్వగ్రామం శివ్వాంవెళ్తున్న క్రమంలో ప్రమాదం జరిగింది. సమాచారం మేరకు వంగర, వీరఘట్టం, రేగిడి మండలాల 108 వాహనాలు వచ్చి క్షతగాత్రులను రాజాంలోని జీఎంఆర్ కేర్ ఆస్పత్రికి తరలించగా ప్రథమ చికిత్స పొందారు. ఇద్దరి పరిస్థితి విషమంగా ఉండడంతో శ్రీకాకుళం తరలించారు.

శిక్షణను సద్వినియోగం చేసుకోండి

- చెన్నై నాసిన్ అసిస్టెంట్ డైరెక్టర్ అనూరాధ రమేష్

విజయనగరం క్రైమ్: పోలీస్ శిక్షణ కళాశాలలో ఇచ్చిన శిక్షణను పోలీస్ అధికారులందరూ శ్రద్ధగా నేర్చుకుని విధుల్లో రాణించాలని చెన్నై నాసిన్ అసిస్టెంట్ డైరెక్టర్ అనూరాధ రమేష్ సూచించారు. 81 మంది కస్టమ్స్ ఇన్స్‌పెక్టర్స్‌కు రెండు వారాలుగా నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో ఆమె సోమవారం మాట్లాడారు. కస్టమ్స్ ఇన్స్‌పెక్టర్స్‌కు పోలీస్ శిక్షణ విధుల్లో ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో పీటీసీ ప్రిన్సిపాల్ టి.ఆనందబాబు, వైస్ ప్రిన్సిపాల్ పీవీ అప్పారావు, డీఎస్పీలు సీహెచ్‌వీ రామారావు, వి.వి.అప్పారావు, తదితరులు పాల్గొన్నారు.

కుండ పోయి.. డొక్కు వచ్చె..



వేసవి వస్తుందంటే ఈత, తాటికల్లు సీజన్ ఆరంభమవుతుంది. గతంలో కల్లుగీత కార్మికులు చెట్లకు కుండలు కట్టి కల్లు సేకరించేవారు. కాలంతో పాటు గీత కార్మికులూ మారారు. మట్టి కుండలు బద్దలైపోవడం, అల్లరిమూకలు రాళ్లతో కొట్టడం వంటి మస్యల నుంచి గట్టెక్కేందుకు కుండలు స్థానంలో ప్లాస్టిక్ డొక్కులను చెట్లకు అమర్చుతున్నారు. దీనికి రాజాం పట్టణం ఆదర్శనగర్ మద్దువలస కాలనీ సమీపంలో కనిపించిన ఈ చిత్రాలే నిదర్శనం.

– రాజాం

వేగవంతంగా కులగణన


సీతారామునిపేటలో కులగణన సర్వేను పరిశీలిస్తున్న ఎంపీడీఓ రామారావు

సామాజిక ప్రయోజనాల కల్పనలో భాగంగా ప్రభుత్వం కులగణన సర్వే చేపట్టింది. ఇది విజయనగరం జిల్లాలో చురుగ్గా సాగుతోంది. సచివాలయ సిబ్బంది, వలంటీర్లు ఇంటింటికీ వెళ్లి కులాల వివరాలను నమోదుచేస్తున్నారు. కలెక్టర్ నాగలక్ష్మి ఆదేశాల మేరకు ఎంపీడీఓలు సర్వేను పర్యవేక్షిస్తున్నారు. సిబ్బందికి సూచనలు, సలహాలు ఇస్తున్నారు. ఇప్పటివరకు చాలా మండలాల్లో 96 శాతం కులగణన సర్వే పూర్తయినట్టు అధికారులు చెబుతున్నారు. నెల్లిమర్ల మండలంలోని కొత్తపేట, సీతారామునిపేట, రామతీర్థం గ్రామాల్లో సాగుతున్న కులగణన సర్వేను ఎంపీడీఓ గిడుతూరి రామారావు సోమవారం పర్యవేక్షించారు.

– నెల్లిమర్ల రూరల్

కానసింగిలో కొత్తల పండగ


కానసింగిలో కొత్తల పండగలో ఛత్రాలు పట్టుకొని నృత్యం చేస్తున్న గిరిజనులు

గుమ్మలక్ష్మీపురం మండలం కానసింగి గిరిజన గ్రామంలో సోమవారం కొత్తల పండగ దప్పు మోగింది. పదేళ్లకోసారి జరిగే పండగను గిరిజనులందరూ కలిసి వైభవంగా జరిపారు. ముందుగా గ్రామదేవతలకు పూజలు చేశారు. మొక్కుబడులు చెల్లించారు. దప్పువాయిద్యాలను లయబద్ధంగా మోగించారు. సంప్రదాయ నృత్యాలతో అలరించారు. ఛత్రాలతో సందడి చేశారు.

– గుమ్మలక్ష్మీపురం

ఆరోగ్య అభయం



రాజాం: జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ప్రజారోగ్యానికి అధిక ప్రాధాన్యమిస్తోంది. ఇప్పటికే ప్రభుత్వాస్పత్రులను ఆధునీకరించడంతో పాటు ఆధునిక వైద్య పరికరాలు సమకూర్చింది. వైద్యులు, సిబ్బందిని పూర్తిస్థాయిలో నియమించింది. వైఎస్సార్ విలేజ్‌క్లినిక్స్, ఫ్యామిలీ డాక్టర్, జగనన్న ఆరోగ్యసురక్షతో వైద్యసేవలను పల్లె/వార్డు చెంతకు చేర్చింది. మరోవైపు వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకం కింద వైద్య ఖర్చుల పరిమితిని రూ.5 లక్షల నుంచి రూ.25లక్షలకు పెంచింది. అర్హులైన ప్రతీ కుటుంబానికి కొత్తగా ఆరోగ్యశ్రీకార్డులను పంపిణీ చేస్తూ ఆరోగ్య అభయం కల్పిస్తోంది. బొద్దాం గ్రామంలో కొత్తగా మంజూరైన కార్డులను సోమవారం పంపిణీ చేస్తున్న పంచాయతీ కార్యదర్శి కె.దిలీప్‌కుమార్, వలంటీర్లను చిత్రంలో చూడొచ్చు.

మారేడు కాయలకు భలే గిరాకీ



కురుపాం: మార్కెట్లో మారేడు కాయలకు డిమాండ్ నెలకుంది. ఏజెన్సీలో విరివిగా దొరికే మారేడు కాయలను సుగంధి అని పిలుస్తారు. వీటిని పొడరుగా చేసి వేసవిలో శీతల పానీయాల షాపుల్లో విక్రయిస్తారు. ఔషధ గుణాలు మెండుగా ఉండడంతో కేజీ మారేడు కాయలను స్థానిక వ్యాపారులు రూ.20కు కొనుగోలు చేస్తున్నారు. వాటిని బాగా ఎండబెట్టిన తరువాత కేజీ రూ.40కు మైదాన ప్రాంతాలకు విక్రయిస్తున్నట్టు వ్యాపారులు చెబుతున్నారు. వచ్చేది వేసవి కాలం దృష్ట్యా మరింత డిమాండ్ పెరుగుతుందని పేర్కొన్నారు.